ఆ సాధువు వెళ్లింతర్వాత కూడా అడంగులంతా సాధువుగురించి కొండంతలుగా చెప్పుకోసాగారు. అంతలో మామ్మగార్ని డాక్టరుగారింటికి తీసికెళ్లేందుకని రిక్షా రంగన్న మామూలు వేళకి వచ్చాడు. రంగన్న అందరికీ తెలిసినవాడే!

వాడు జరిగిన కథంతా విని "జైసద్గురూ! అనే ఆ సాధువా? వాడు మొన్న మా యింటికొచ్చి "నువ్వు రోజూ రిక్షాలో దిగబెట్టే ముసిలావిడ ఎవరోయ్'' అని టీ నీళ్ళిప్పిస్తే నేను మీగురించి అంతా చెప్పేను. వాడింత మోసం చేస్తాడనుకోలేదు' అనేసరికి వాళ్ల మొహాలెలా ఉంటాయో మీరే ఊహించగలరు!!

''చెవెర్తి''

* * *

## కిరసనాయిలు మేలు

మా రూములో మొత్తం ముగ్గురం ఉండేవాళ్ళం. మిగిలిన ఇద్దరిలో రాము కొంచెం నమ్మకంగల మనిషి, సౌమ్యుడు కూడాను. ఇక "కృష్ణ" పరమ గడుగ్గాయి. కిలాడీరాయుడు కూడాను. నేను తెచ్చే "హెయిర్ ఆయిల్" రెండు రోజులకే అంతం చేసేవాడు. తన ఆయిల్ వాడేవాడు కాదు. చాలాకాలం వీడితో బాధపడ్డాను. చివరకి ఒకరోజున మెరపులాంటి ఓ ఉపాయం తట్టింది.

యథాప్రకారం "కృష్ణ" నా ఆయిల్ బాటిల్ తెరిచి గబగబా ఒంపుకొని తలకు రాసుకున్నాడు. ఇంకేముంది గప్పుమని "కిరసనాయిలు" వాసన వచ్చింది.

ఆయిల్ బాటిల్ నిండా కిరసనాయిలు కలుపబడినట్లు ఆ చతురునికి ఏం తెలుసు!

నాటినుంచి నా ఆయిల్ పూర్తిగా నెలరోజులు సరిపోయేది నాకు. "కిరసనాయిలు" అంటే నాకు తగని ప్రేమసుమండీ!

—గవ్వా కన్నారావు.

## గడుసరి పెళ్లాం

రాజయ్య అమాయకుడు, పెళ్ళాం అంటే భయం. ఇతడెంత అమాయకుడో అంత గయ్యాళి అతని పెళ్లాం. ఆతనికి "మెవ్వొంకాయ"లనిన అతి ప్రీతి. అంచేత తనపొలంలో వంకాయ విత్తనాలు జల్లేడు. కొద్దికాలానికి కాయలు కాయటము ప్రారంభమైంది. అందులో ఒక మ్రొక్కకు మూడు కాయలు ముదిరినవి. రాజయ్య కాయలుకోసి ఇంటికి తెచ్చి ఏమేవ్! ఇదిగో... నిన్నేనే... చూడు అని పిలవగా ఏమయ్యా? ఏంపని? అని అడిగింది. ఈమూడు మొవ్వొంకాయలు బాగా ఉప్పుకారం బెట్టి రుచిగావండి నే పొలం నుండి వచ్చేటప్పటికి దాచి ఉంచాలి అని చెప్పి పొలంకి పోయాడు. ఆమె నేతిలో వేపటము మొదలుపెట్టింది. "నేతిమిఠాయి" వాసనేసినట్లు "ఆ పాత్రలోయున్న మొవ్వొంకాయలు వాసనేస్తున్నాయి. ఆమె రుచి చూద్దామని ఒక కాయ దిగమ్రింగింది. మిగిలియున్నది రెండే. వేళ మించింది. రాజయ్య పొలంనుంచి రాలేదు. ఆమె ఆకలి భరించలేక "అర్ధాంగికి సగము వంతు ఇచ్చుట భర్తకిష్టముగా" అని అనుకొని, మిగిలిన రెండింటిలో ఒకటి భోంచేసింది. రాజయ్య ఆకలితో ఇంటికి వచ్చాడు. భోజనార్థమై గిన్నెయొద్ద కూర్చొనగా, ఒకటె కనిపిస్తుంది. ఒకటె యుందేమే? అని అడిగేడు. రుచి చూద్దామని ఒకటి తింటిని. ఇక మిగిలినవి రెండు. రెండింటిలో ధర్మము ప్రకారము మీకు ఒకటి దాచి ఒకటి నేను భోజనముతో తింటిని. అందులో తప్పేముంది. అని ధైర్యంగా ఆ "గడుసరి పెళ్ళాం" సమాధాన మిచ్చినది. ఎట్లా తింటివే? నే అన్నీ దాచమని చెప్పలేదటె? అని కోప్పడి పిరికి సాహసము ఆమెమీద చేయబూనెను. నీపని ఇలాయుందా...అని ఆ గిన్నెపైయున్న ఒక వంకాయనుకూడా దిగమ్రింగెను.

—ధర్మాన రామకృష్ణారావు.

## గురుశిష్యులు

శంకరం మూడవతరగతి విద్యార్థి. ప్రయివేటు మాస్టరువచ్చి పాఠాలు చెప్పడం ప్రారంభించారు. శంకరం శ్రద్ధగా వింటున్నాడు. ఇంతలో ఇంటిలో గొడవ ప్రారంభమయింది. ఈజేబులోని రూపాయి ఎవరుతీసారు చెప్మా? శంకరం నాన్న రుసరుసలాడుతూ తల్లిని ప్రశ్నించడంవిన్నాడు. ఏమోనండి నాకు తెలియదు అంది తల్లి వంటపనిచేసుకుంటూ. బజారుకు వెళ్లి ఏదో పట్టుకొద్దామని కోటువేసుకొని జేబు చూసుకుంటే ఖాలీగా ఉండడం చూచి మరీ రెచ్చిపోయాడు శంకరం తండ్రి. ఈ జేబులోనే పెట్టాను ఎలా మాయమయిందో కదా! ఆ శంకరం గాడ్ని ఓమాటుపిలు. పాఠాలువింటున్నాడన్న మాటేకాని శంకరం ధ్యానమంతా ఇంట్లో జరుగుతున్న గొడవ మీదే ఉంది. ఏమిటినాన్నా అంటూ ధైర్యంగా వినయవిధేయతతో వచ్చి నిలుచున్నాడు శంకరం. ఈజేబులోని రూపాయి తీసావట్రా, తండ్రి కోపంగా ప్రశ్నించాడు. నేను తీయలేదునాన్నా వినయంగా జవాబు చెప్పాడు శంకరం. సరే వెళ్లి చదువుకో.

శంకరం రాగానే మాస్టరు అడిగాడు మీనాన్నగారి జేబులోని రూపాయి పోయిందటగా? లేదండి మాస్టారూ ఇదుగో నేనే తీసి, కాపీ బుక్కులు పెన్సిలు కొనుక్కున్నాను అన్నాడు శంకరం. ఓరివెధవా మరి మీనాన్నగారు అడిగితే తీయలేదన్నావేమిరా? మీరే కదటండీ చెప్పారు. "ఎప్పటి కెయ్యదిప్రస్తుత మప్పటికా మాటలాడి..." అనుపద్యం ఈకోపావేశంలో నేనే తీసానని చెప్తే నా వీపు విమానంమోత మోగదటండీ. కోపం పోయాక చెప్పవచ్చు అన్నాడు శంకరం. ఇదట్రా నీవు తీసుకున్న అర్థం అని గూబలు మెలివేసాడు మాస్టరు

సియ్యాద్రి గురుమూర్తి.